14-11-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మనుష్యులను దేవతలుగా తయారుచేసే సేవలో విఘ్నాలు తప్పకుండా కలుగుతాయి. మీరు కష్టాలు సహించైనా సరే ఈ సేవలో తత్పరులై ఉండాలి, దయార్ద్ర హృదయులుగా అవ్వాలి"

ప్రశ్న:- ఎవరికైతే అంతిమ జన్మ యొక్క స్మృతి ఉంటుందో వారి గుర్తులు ఏమిటి?

జవాబు:- వారి బుద్ధిలో ఇలా ఉంటుంది - ఇప్పుడు ఈ ప్రపంచంలో మనము మరొక జన్మను తీసుకోకూడదు, అలాగే ఇంకొకరికి జన్మను ఇవ్వకూడదు. ఇది పాపాత్ముల ప్రపంచము, ఇది ఇప్పుడిక వృద్ధి చెందకూడదు. ఇది వినాశనమవ్వనున్నది. మేము ఈ పాత వస్త్రాలను వదిలి మా ఇంటికి వెళ్తాము, ఇప్పుడు ఈ నాటకం పూర్తయ్యింది.

పాట:- కొత్త తరం యొక్క మొగ్గలు... (నయీ ఉమర్ కీ కలియా...)

ఓం శాంతి. తండ్రి కూర్చొని పిల్లలకు అర్థం చేయిస్తారు - పిల్లలైన మీరు ప్రతి ఒక్కరి జ్యోతిని వెలిగించాలి. ఇది మీ బుద్ధిలో ఉంది. మనుష్యమాత్రులెవరైతే ఉన్నారో, వారికి ముక్తి యొక్క మార్గాన్ని తెలియజేయాలని తండ్రికి కూడా అనంతమైన ఆలోచన ఉంటుంది. తండ్రి వచ్చేదే పిల్లల సేవ చేయడానికి, దుఃఖాల నుండి విడిపించడానికి. ఇక్కడ దుఃఖము ఉంది కావున సుఖము ఉండే స్థానము కూడా ఏదో ఉంటుందని మనుష్యులు అర్థం చేసుకోరు, వారికి అది తెలియదు. శాస్త్రాలలో సుఖము యొక్క స్థానాన్ని కూడా దుఃఖము యొక్క స్థానంగా చూపించారు. ఇప్పుడు తండ్రి దయార్ద్ర హృదయులు. మనుష్యులకు తాము దుఃఖితులుగా ఉన్నారు అన్నది కూడా తెలియదు ఎందుకంటే వారికి సుఖము గురించి మరియు సుఖాన్ని ఇచ్చేవారి గురించి తెలియనే తెలియదు. ఇది కూడా డ్రామాలో రచింపబడి ఉంది. సుఖమని దేనిని అంటారు, దుఃఖమని దేనిని అంటారు అనేది తెలియదు. ఈశ్వరుని గురించి - వారే సుఖ-దుఃఖాలను ఇస్తారు అని అంటారు. అంటే వారిపై కళంకాన్ని మోపుతున్నారు. ఈశ్వరుడు, ఎవరినైతే తండ్రి అని అంటారో, వారి గురించి తెలియనే తెలియదు. తండ్రి అంటారు - నేను పిల్లలకు సుఖాన్నే ఇస్తాను. బాబా పతితులను పావనంగా చేయడానికే వచ్చారని ఇప్పుడు మీకు తెలుసు. నేను అందరినీ స్వీట్ హోమ్ కు తీసుకువెళ్తాను అని వారు అంటారు. ఆ స్వీట్ హోమ్ కూడా పావనమైనది. అక్కడ పతిత ఆత్మలెవ్వరూ ఉండరు. ఆ నివాస స్థానము గురించి ఎవ్వరికీ తెలియదు. ఫలానావారు నిర్వాణం చెందారని అంటారు కానీ అర్థం చేసుకోరు. బుద్ధుడు నిర్వాణం చెందారంటే తప్పకుండా ఇంతకుముందు అక్కడే నివసించేవారు, మళ్ళీ అక్కడికే వెళ్ళారు. అచ్ఛా, అతనైతే వెళ్ళారు, మరి మిగిలినవారు ఎలా వెళ్ళాలి? అతనితో పాటు అయితే ఎవరినీ తీసుకువెళ్ళలేదు. వాస్తవానికి వారు వెళ్ళరు, అందుకే అందరూ పతిత-పావనుడైన తండ్రిని స్మృతి చేస్తారు. పావన ప్రపంచాలు రెండు ఉన్నాయి - ఒకటి ముక్తిధామము, మరొకటి జీవన్ముక్తిధామము. శివపురి మరియు విష్ణుపురి. ఇది రావణపురి. పరమపిత పరమాత్మను రాముడు అని కూడా అంటారు. రామరాజ్యమని అన్నప్పుడు బుద్ధి పరమాత్ముని వైపుకు వెళ్ళిపోతుంది. మనిషిని పరమాత్మగా అయితే అందరూ ఒప్పుకోరు. కావున మీకు దయ కలుగుతుంది. కష్టాలనైతే సహించాల్సి ఉంటుంది.

బాబా అంటారు - మధురమైన పిల్లలూ, మనుష్యులను దేవతలుగా తయారుచేయడంలో ఈ జ్ఞాన యజ్ఞంలో విఘ్నాలు ఎన్నో కలుగుతాయి. గీతా భగవంతుడు నిందలపాలు అయ్యారు కదా. నిందలు అతనికి కూడా మరియు మీకు కూడా లభిస్తాయి. బహుశా ఇతను చవితి చంద్రుడిని చూసారేమో అని అంటారు కదా. ఇవన్నీ కట్టు కథలు. ప్రపంచంలో ఎంతటి అశుద్ధత ఉంది. మనుష్యులు ఏమేమో తింటూ ఉంటారు, జంతువులను హతమారుస్తారు, ఏమేమో చేస్తూ ఉంటారు! తండ్రి వచ్చి ఈ విషయాలన్నింటి నుండి విడిపిస్తారు. ప్రపంచంలో కొట్లాటలు ఎంతగా ఉన్నాయి. మీ కొరకు తండ్రి ఎంత సహజం చేస్తారు. తండ్రి అంటారు - మీరు కేవలం నన్ను స్మృతి చేసినట్లయితే వికర్మలు వినాశనమవుతాయి. అందరికీ ఒకే విషయాన్ని అర్థం చేయించండి. తండ్రి అంటారు - మీరు శాంతిధామాన్ని మరియు సుఖధామాన్ని స్మృతి చేయండి. మీరు వాస్తవానికి అక్కడి నివాసులు. సన్యాసులు కూడా అక్కడికే దారి చూపుతారు. ఒకవేళ ఎవరైనా ఒకరు నిర్వాణధామానికి వెళ్ళిపోతే మరి ఇతరులను ఎలా తీసుకువెళ్తారు? వారిని ఎవరు తీసుకువెళ్తారు? ఒకవేళ బుద్ధుడు నిర్వాణధామానికి వెళ్ళారని భావించినట్లయితే, మరి అతని బౌద్ధులు ఇక్కడే కూర్చున్నారు, వారిని కూడా తిరిగి తీసుకువెళ్ళాలి కదా. సందేశకులెవరైతే ఉన్నారో వారందరి ఆత్మలు ఇక్కడే ఉన్నాయని గానం కూడా చేస్తారు, అనగా వారు ఏదో ఒక శరీరంలో ఉన్నారు, అయినా కూడా మహిమ చేస్తూ ఉంటారు.

అచ్చా, ధర్మ స్థాపన చేసి వెళ్ళారు, ఆ తర్వాత ఏమైంది? ముక్తిలోకి వెళ్ళేందుకు మనుష్యులు ఎంతగా తల బాదుకుంటూ ఉంటారు. వారైతే ఈ జప-తపాదులు, తీర్థ యాత్రలు మొదలైనవి నేర్పించలేదు. తండ్రి అంటారు, నేను అందరికీ గతి, సద్గతులను ఇచ్చేందుకే వస్తాను. అందరినీ తీసుకువెళ్తాను. సత్యయుగంలో జీవన్ముక్తి ఉంటుంది. ఒకటే ధర్మం ఉంటుంది, మిగిలిన ఆత్మలందరినీ తిరిగి తీసుకువెళ్తాను. బాబా తోట యజమాని అని, మనమంతా తోటమాలులము అని మీకు తెలుసు. మమ్మా, బాబా మరియు పిల్లలందరూ తోటమాలులుగా అయి బీజాలు నాటుతూ ఉంటారు. దాని నుండి మొలక వస్తుంది, అప్పుడు మాయ తుఫానులు వస్తాయి. అనేక రకాల తుఫానులు వస్తాయి. ఇవి మాయ కలిగించే విఘ్నాలు. తుఫానులు వచ్చినప్పుడు అడగాలి - బాబా, దీని కొరకు ఏం చేయాలి? శ్రీమతాన్ని ఇచ్చేవారు తండ్రి. తుఫానులైతే వస్తూనే ఉంటాయి. నంబరువన్ దేహాభిమానము. నేను ఆత్మను అవినాశీ, ఈ శరీరము వినాశీ అని భావించరు. మన 84 జన్మలు పూర్తయ్యాయి. ఆత్మయే పునర్జన్మలు తీసుకుంటుంది. ఘడియ-ఘడియ ఒక శరీరాన్ని వదిలి మరొక శరీరాన్ని తీసుకోవడమనేది ఆత్మ పనే. ఇప్పుడు తండ్రి అంటారు - ఇది మీ అంతిమ జన్మ, ఈ ప్రపంచంలో మరొక జన్మను తీసుకోకూడదు, అలాగే ఎవరికీ జన్మను ఇవ్వకూడదు. మరి ఈ సృష్టి ఎలా వృద్ధి చెందుతుంది అని అడుగుతారు? అరే, ఈ సమయంలో సృష్టి వృద్ధి చెందాల్సిన అవసరం లేదు. ఇది భ్రష్టాచారము యొక్క వృద్ధి. ఈ ఆచారము రావణుడి నుండి ప్రారంభమయ్యింది. ప్రపంచాన్ని భ్రష్టాచారిగా చేసేది రావణుడు. శ్రేష్ఠాచారిగా రాముడు చేస్తారు. ఇందులో కూడా మీరు ఎంత శ్రమించాల్సి ఉంటుంది. ఘడియ-ఘడియ దేహాభిమానంలోకి వచ్చేస్తారు. ఒకవేళ దేహాభిమానంలోకి రాలేదు అంటే స్వయాన్ని ఆత్మగా భావించండి. సత్యయుగంలో కూడా స్వయాన్ని ఆత్మగా అయితే భావిస్తారు కదా. ఇప్పుడు మా ఈ శరీరము వృద్ధాప్యానికి చేరుకుంది, దీనిని వదిలి కొత్తది తీసుకుంటాము అని వారికి తెలుసు. ఇక్కడైతే ఆత్మ జ్ఞానము కూడా లేదు. స్వయాన్ని దేహంగా భావిస్తూ కూర్చున్నారు. ఎవరైతే దుఃఖితులుగా అవుతారో, వారికే ఈ ప్రపంచం నుండి వెళ్ళిపోవాలి అని మనసుకు అనిపిస్తుంది. అక్కడైతే సుఖమే ఉంటుంది. అక్కడ ఆత్మ జ్ఞానమైతే ఉంటుంది. ఒక శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకుంటారు కావున అక్కడ దుఃఖము ఉండదు. అది సుఖపు ప్రారబ్ధము. ఇక్కడ కూడా ఆత్మ అని అంటారు, కానీ కొందరు ఆత్మయే పరమాత్మ అని అనేస్తారు. ఆత్మ ఉంటుంది - అన్న జ్ఞానమైతే ఉంది కదా. కానీ మనము ఈ పాత్ర నుండి తిరిగి వెళ్ళలేము అన్నది వారికి తెలియదు. ఒక శరీరాన్ని వదిలి తప్పకుండా ఇంకొకటి తీసుకోవాలి. పునర్జన్మలనైతే అందరూ అంగీకరిస్తారు. చేసిన కర్మలకైతే అందరూ అనుభవిస్తారు కదా. మాయా రాజ్యంలో కర్మలు వికర్మలుగానే అవుతాయి, కావున కర్మలను అనుభవిస్తూ ఉంటారు. అక్కడ అనుభవించాల్సిన కర్మలేవీ ఉండవు.

ఇప్పుడు తిరిగి వెళ్ళాలని మీరు భావిస్తారు. వినాశనమైతే జరగాల్సిందే. బాంబులతో ట్రయల్స్ కూడా వేస్తున్నారు. తర్వాత క్రోధంలోకి వచ్చి వాటిని వేసేస్తారు. ఇవి శక్తిశాలీ బాంబులు. యూరప్ వాసులు యాదవులు అని అంటూ ఉంటారు కూడా. మనం అన్ని ధర్మాలవారిని యూరప్ వాసులనే అంటాము. భారత్ ఒకవైపు ఉంది, మిగిలినవారందరినీ ఇంకొకవైపు కలిపేసారు. వారి ఖండము పట్లనైతే వారికి ఎంతో ప్రేమ ఉంది. కానీ విధియే అలా ఉంటే ఇక ఏం చేస్తారు? శక్తినంతా మీకు బాబా ఇస్తున్నారు. యోగబలము ద్వారా మీరు రాజ్యాన్ని తీసుకుంటారు. మీకు ఎటువంటి శ్రమ ఇవ్వరు. తండ్రి అంటారు, కేవలం నన్ను స్మృతి చేయండి, దేహాభిమానాన్ని విడిచిపెట్టండి. నేను రాముడిని తలుచుకుంటాను, శ్రీకృష్ణుడిని తలుచుకుంటాను అని అంటారు, కానీ వారు స్వయాన్ని ఆత్మగా భావించరు. ఆత్మ అని భావించినట్లయితే మరి ఆత్మిక తండ్రిని ఎందుకు స్మృతి చేయరు? తండ్రి అంటారు - పరమపిత పరమాత్మనైన నన్ను స్మృతి చేయండి. మీరు జీవాత్మలను ఎందుకు స్మృతి చేస్తారు? మీరు దేహీ-అభిమానులుగా అవ్వాలి. నేను ఆత్మను, తండ్రిని స్మృతి చేస్తాను. తండ్రి ఆజ్ఞను ఇచ్చారు - స్మృతి చేయడం ద్వారా వికర్మలు వినాశనమవుతాయి మరియు వారసత్వం కూడా బుద్ధిలోకి వస్తుంది. తండ్రి మరియు వారసత్వము అనగా ముక్తి మరియు జీవన్ముక్తి. వాటి కొరకే ఎదురుదెబ్బలు తింటూ ఉంటారు. యజ్ఞాలు, జప-తపాదులు మొదలైనవి చేస్తూ ఉంటారు. పోప్ వద్దకు కూడా ఆశీర్వాదాలు తీసుకునేందుకు వెళ్తారు, ఇక్కడ తండ్రి కేవలం - దేహాభిమానాన్ని వదలండి, స్వయాన్ని ఆత్మగా నిశ్చయం చేసుకోండి అని మాత్రమే చెప్తారు. ఈ నాటకం పూర్తయ్యింది, మన 84 జన్మలూ పూర్తయ్యాయి, ఇప్పుడిక వెళ్ళాలి. ఎంత సహజం చేసి అర్థం చేయిస్తారు. గృహస్థ వ్యవహారంలో ఉంటూ బుద్ధిలో ఇది ఉంచుకోండి. ఏ విధంగానైతే నాటకం పూర్తయ్యే సమయములో ఈ విధంగా భావిస్తారు కదా - ఇంకా 15 నిమిషాలు మిగిలి ఉంది, ఇప్పుడు ఈ సీన్ పూర్తవుతుంది. పాత్రధారులు - మేము ఈ వస్త్రాలను మార్చుకుని ఇంటికి వెళ్తాము అని భావిస్తారు. ఇప్పుడు అందరూ తిరిగి వెళ్ళాలి. ఈ విధంగా మీతో మీరు మాట్లాడుకోవాలి. మనం సుఖ-దుఃఖాల పాత్రను ఎంత సమయం అభినయించాము అనేది తెలుసు. ఇప్పుడు తండ్రి అంటారు - నన్ను స్మృతి

చేయండి, ప్రపంచంలో ఏమేమి జరుగుతుందో దానంతటినీ మర్చిపోండి - అందరూ అంతమైపోనున్నారు, ఇప్పుడు తిరిగి వెళ్ళాలి. వారు - కలియుగం ఇప్పుడింకా 40 వేల సంవత్సరాలు కొనసాగుతుందని భావిస్తారు. దీనిని ఘోర అంధకారమని అంటారు. తండ్రి పరిచయము లేదు. జ్ఞానము అనగా తండ్రి పరిచయము, అజ్ఞానము అనగా పరిచయము లేకపోవడము, అంటే వారు ఘోర అంధకారంలో ఉన్నట్లు. ఇప్పుడు మీరు నంబరువారు పురుషార్థానుసారంగా అత్యంత ప్రకాశంలో ఉన్నారు. ఇప్పుడు రాత్రి పూర్తవ్వనున్నది, మనం తిరిగి వెళ్తాము. ఈ రోజు బ్రహ్మా యొక్క రాత్రి, రేపు బ్రహ్మా యొక్క పగలు ఉంటుంది, అలా మారడానికి సమయమైతే పడుతుంది కదా. ఇప్పుడు మనం మృత్యులోకములో ఉన్నామని, రేపు అమరలోకములో ఉంటామని మీకు తెలుసు. మొదటైతే తిరిగి వెళ్ళాల్సి ఉంటుంది. ఈ విధంగా ఈ 84 జన్మల చక్రము తిరుగుతుంది. ఈ తిరగడం ఆగిపోదు. తండ్రి అడుగుతారు - మీరు ఎన్ని సార్లు నన్ను కలిసి ఉంటారు? అనేక సార్లు కలిసామని పిల్లలంటారు. మీ 84 జన్మల చక్రము పూర్తి అయితే, ఇక అందరిదీ పూర్తవుతుంది. దీనినే జ్ఞానము అని అంటారు. జ్ఞానాన్ని ఇచ్చేవారు జ్ఞానసాగరుడు, పరమపిత పరమాత్మ, పతిత-పావనుడు. పతితపావనుడు అని ఎవరిని అంటారు అనేది మీరు అడగవచ్చు. భగవంతుడు అని నిరాకారుడినే అంటారు, మరి మీరు రఘుపతి రాఘవ రాజా రామ్ అని ఎందుకు అంటారు? ఆత్మల తండ్రి అయితే ఆ నిరాకారుడే, అర్థం చేయించేందుకు చాలా యుక్తి కావాలి.

రోజు-రోజుకు మీ ఉన్నతి జరుగుతూ ఉంటుంది ఎందుకంటే గుహ్యమైన జ్ఞానము లభిస్తూ ఉంటుంది. అర్థం చేయించేందుకు కేవలం అల్ఫ్ (భగవంతుని) యొక్క విషయముంది. భగవంతుడిని మర్చిపోయేటప్పటికి అనాథలుగా అయిపోయారు, దుఃఖితులుగా అవుతూ ఉంటారు. ఒక్కరి ద్వారా, ఒక్కరినే తెలుసుకోవడంతో మీరు 21 జన్మలు సుఖవంతులుగా అవుతారు. ఇది జ్ఞానము, పరమాత్మ సర్వవ్యాపి అని అంటే అది అజ్ఞానము. అరే, వారైతే తండ్రి. తండ్రి అంటారు - మీ లోపల ఉన్న భూతాలు సర్వవ్యాపి. పంచ వికారాల రూపీ రావణుడు సర్వవ్యాపి. ఈ విషయాలను అర్థం చేయించాల్సి ఉంటుంది. మేము ఈశ్వరుని ఒడిలో ఉన్నాము అని చాలా గొప్ప నషా ఉండాలి. తర్వాత భవిష్యత్తులో దేవతల ఒడిలోకి వెళ్తారు. అక్కడైతే సదా సుఖము ఉంటుంది. శివబాబా మనల్ని దత్తత తీసుకున్నారు. వారిని స్మృతి చేయాలి. స్వయం మరియు ఇతరుల యొక్క కళ్యాణము కూడా చేయాలి, అప్పుడు రాజ్యం లభిస్తుంది. ఇది అర్థం చేసుకోవాల్సిన చాలా మంచి విషయము. శివబాబా నిరాకారుడు, ఆత్మలమైన మనం కూడా నిరాకారులమే. అక్కడ మనం అశరీరిగా, వివస్త్రగా ఉండేవారము. బాబా అయితే సదా అశరీరియే, బాబా ఎప్పుడూ శరీరము రూపీ వస్త్రాన్ని ధరించి పునర్జన్మలు తీసుకోరు. బాబా ఒక్కసారే అవతరిస్తారు. మొట్టమొదట బ్రాహ్మణులను రచిస్తారు కావున వారిని తమవారిగా చేసుకుని పేరు పెట్టాల్సి ఉంటుంది కదా. బ్రహ్మ లేకపోతే బ్రాహ్మణులు ఎక్కడి నుండి వస్తారు? కావున పూర్తి 84 జన్మలు తీసుకున్నవారు వీరే. తెల్లగా ఉన్న వీరు మళ్ళీ నల్లగా అయ్యారు. సుందరము నుండి శ్యామముగా, శ్యామము నుండి సుందరముగా అవుతారు. భారత్ కు కూడా మనము శ్యామసుందరము అన్న పేరు పెట్టవచ్చు. భారత్ నే శ్యామము అని, భారత్ నే స్వర్ణిమ యుగము, సుందరము అని అంటారు. భారత్ యే కామచితిపై కూర్చొని నల్లగా అవుతుంది, మళ్ళీ భారత్ యే జ్ఞానచితిపై కూర్చొని తెల్లగా అవుతుంది. భారత్ వెనుకే కష్టపడాల్సి ఉంటుంది. భారతవాసులే మళ్ళీ ఇతర ధర్మాలలోకి కన్వర్ట్ అయిపోయారు. యూరోప్ వాసులకు మరియు భారతవాసులకు తేడా కనిపించదు, అక్కడికి వెళ్ళి వివాహం చేసుకుంటే క్రిస్టియన్లుగా పిలవబడతారు. వారి పిల్లలు మొదలైనవారు కూడా అవే ముఖ కవళికలతో ఉంటారు. ఆఫ్రికాలో కూడా వివాహం చేసుకుంటారు.

చక్రాన్ని అర్థం చేసుకునేందుకు ఇప్పుడు బాబా విశాల బుద్ధిని ఇస్తారు. వినాశకాలములో విపరీత బుద్ధి అని కూడా రాయబడి ఉంది. యాదవులు మరియు కౌరవులు ప్రీతిని ఉంచలేదు. ఎవరైతే ప్రీతిని ఉంచారో వారే విజయాన్ని పొందారు. శత్రువుదే విపరీత బుద్ధి అని అంటారు. తండ్రి అంటారు, ఈ సమయంలో అందరూ పరస్పరం శత్రువులుగా ఉన్నారు. తండ్రినే సర్వవ్యాపి అని అంటూ నిందిస్తారు లేదా వారు జనన-మరణ రహితుడు అని, వారికి ఎటువంటి నామ-రూపాలు లేవు అని అంటారు. ఓ గాడ్ ఫాదర్ అని కూడా అంటారు, ఆత్మ మరియు పరమాత్మల సాక్షాత్కారం కూడా జరుగుతుంది. చూడటానికి ఆత్మలు మరియు పరమాత్మలో తేడా ఏమీ ఉండదు. కాకపోతే శక్తి అనేది నంబరువారుగా ఎక్కువ-తక్కువ ఉంటుంది. మనుష్యులు మనుష్యులే, వారిలో కూడా పదవులు ఉంటాయి. బుద్ధిలో తేడా ఉంటుంది. జ్ఞానసాగరుడు మీకు జ్ఞానాన్ని ఇచ్చారు కావున వారిని స్మృతి చేస్తారు, మీ ఆ అవస్థ అంతిమంలో తయారవుతుంది.

అమృతవేళ స్మరిస్తూ-స్మరిస్తూ సుఖాన్ని పొందండి, పడుకొని ఉన్నా కానీ నిద్ర రాకూడదు. పట్టుదలతోనైనా

కూర్చోవాలి, ఇందులో శ్రమ ఉంది. వైద్యులు కూడా అమృతవేళ వేసుకునేందుకు మందులు ఇస్తారు. ఇది కూడా ఔషధమే. రచయిత అయిన తండ్రి బ్రహ్మ ద్వారా బ్రాహ్మణులను రచించి చదివిస్తారు - ఈ విషయాన్ని అందరికీ అర్థం చేయించాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మనము ఈశ్వరుని ఒడి తీసుకున్నాము, తర్వాత దేవతల ఒడిలోకి వెళ్తాము, ఈ ఆత్మిక నషాలోనే ఉండాలి. స్వయం మరియు ఇతరుల కళ్యాణము చేయాలి.

2. అమృతవేళ లేచి జ్ఞానసాగరుని జ్ఞానాన్ని మననము చేయాలి. ఒక్కరి అవ్యభిచారీ స్మృతిలో ఉండాలి. దేహాభిమానాన్ని వదలి స్వయాన్ని ఆత్మగా నిశ్చయం చేసుకోవాలి.

వరదానము:- అమృతవేళ నుండి రాత్రి వరకు స్మృతితో విధి పూర్వకంగా ప్రతి కర్మను చేసే సిద్ధి స్వరూప భవ

అమృతవేళ నుండి మొదలుకుని రాత్రి వరకు ఏ కర్మను చేసినా, దానిని స్మృతితో విధి పూర్వకంగా చేసినట్లయితే ప్రతి కర్మకు సిద్ధి లభిస్తుంది. అన్నింటికన్నా అత్యంత పెద్ద సిద్ధి - ప్రత్యక్ష ఫలం రూపములో అతీంద్రియ సుఖం యొక్క అనుభూతి కలగటము. సదా సుఖపు అలలలో, సంతోషపు అలలలో తేలియాడుతూ ఉంటారు. కావున ఈ ప్రత్యక్ష ఫలము కూడా లభిస్తుంది మరియు భవిష్య ఫలము కూడా లభిస్తుంది. ఈ సమయములోని ప్రత్యక్ష ఫలము భవిష్యత్తులోని అనేక జన్మల ఫలము కన్నా శ్రేష్ఠమైనది. ఇప్పుడిప్పుడే చేసారు, ఇప్పుడిప్పుడే లభించింది - దీనినే ప్రత్యక్ష ఫలము అని అంటారు.

స్లోగన్:- స్వయాన్ని నిమిత్తముగా భావిస్తూ ప్రతి కర్మను చేసినట్లయితే అతీతముగా మరియు ప్రియముగా ఉంటారు, నాది అనేది రాదు.